క్లుప్తంగా

మోకాళ్ల నొప్పులకు యోగా శక్తి చికిత్స

పెనమలూరు: మోకాళ్ల నొప్పులకు యోగాశక్తి చికిత్స చాలా అవసరమని యోగాశక్తి సాధన సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ మాకాల సత్యనారాయణ అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా కానూరు అశోక్‌నగర్‌లో ఇండియన్ ఓం కార్యాలయంలో శనివారం ఉచిత మోకాళ్ల చికిత్స శిబిరం నిర్వహించారు. మాకాల సత్యనారాయణ మోకాళ్ల నొప్పులకు ఆక్యుప్రెజర్, ఆక్యుపంక్చర్ విధానంతో చికిత్స చేసుకోవటానికి పరికరాలు అందజేశారు. చికిత్సపై అవగాహన పొందితే ఆపరేషన్ లేకుండా సమస్యను అధిగమించవచ్చన్నారు. యోగా గురువు బాలసురేష్, ఆక్యుథెరపిస్టులు వెలగపూడి దేవి, అంబటి ప్రవల్లిక, కొండవీటి సుమతి పాల్గొన్నారు.

మాజీ ఎంపీటీసీ మృతి

నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ సభ్యుడు ఉయ్యూరు బాబూరావు (62) అనారోగ్యం కారణంగా శనివారం మృతి చెందారు. భార్యా, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నాయి. 1995లో జరిగిన మండల పరిషత్ పాలకవర్గం ఎన్నికల్లో నున్న గ్రామం రెండవ సెగ్మెంట్ నుంచి బాబూరావు గెలుపొందారు. గ్రామంలో జరిగిన అభివృద్ధి పనులకు సహకరించారు. బాబూరావు మృతి పట్ల గ్రామంలోని పలువురు నాయకులు, ప్రజలు శ్రద్ధాంజలి ఘటించారు.

3న పోస్టల్ బ్యాలెట్ల తరలింపు



పెనమలూరు: పెనమలూరులో పోస్టల్ బ్యాలెట్‌లు భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్ వద్ద పోలీసులు పహారా కాస్తున్నారు. సాధారణ ఎన్నికలకు సంబంధించి పోస్టల్ బ్యాలెట్ ఓట్లు గత కొద్ది రోజుల క్రితం ఉద్యోగులు వేశారు. మచిలీపట్నం పార్లమెంట్‌కు సంబంధించి పోస్టల్ బ్యాలెట్ ఓట్లు మచిలీపట్నంకు తరలించారు. పెనమలూరు నియోజకవర్గానికి చెందిన పోస్టల్ బ్యాలెట్ ఓట్లు 3,220ను పెనమలూరు తహసీల్దార్ కార్యాలయంలోని స్ట్రాంగ్ రూమ్‌లో భద్రరిచారు. పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. వీటిని 3న భద్రతా చర్యలు తీసుకుని మచిలీపట్నం కృష్ణా యూనివర్సిటీకి తరలిస్తామని ఏఆర్ఓ ప్రసాద్ తెలిపారు.

ఏజీఅండ్ఎస్‌జీ కళాశాలకు ఏ గ్రేడ్

ఉయ్యూరు: ఏజీఅండ్ఎస్‌జీ సిద్ధార్థ కళాశాలకు నాక్ ఏ గ్రేడ్ ప్రకటించిందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీరామ్ అన్నారు. స్థానిక కళాశాలలో శనివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ప్రిన్సిపాల్ శ్రీరామ్ మాట్లాడుతూ నాక్ (నేషనల్ అసెస్‌మెంట్ అండ్ అక్రిడిడేషన్ కౌన్సిల్) బెంగళూరు బృందం ఈ ఏడాది మే నెలలో కళాశాలలో పర్యటించిందన్నారు. బృందం సభ్యులు ప్రొఫెసర్ రామ్ నివాస్ పటేల్, ప్రొఫెసర్ సీతల్‌కుమార్ చటోపాధ్యాయ, డాక్టర్ గోపాల్ కల్కోటి కళాశాలలోని అన్ని విభాగాలు, గ్రంథాలయం, పరీక్షల విభాగాన్ని అధ్యయనం చేశారన్నారు. నివేదికను బెంగుళూరులోని నాక్ సంస్థకు సమర్పించారన్నారు. సంస్థకళాశాలకు ఏ గ్రేడ్ కేటాయించిందన్నారు. జిల్లాలో ఉయ్యూరు కళాశాలకు ఏ గ్రేడ్ వచ్చిందన్నారు. వరుసగా మూడో సారి తమ కళాశాలకు ఏ గ్రేడ్ రావటంపై ఆనందం వ్యక్తం చేశారు. ఇందుకు కృషి చేసిన అధ్యాపక, ఇతర సిబ్బందికి అభినందనలు తెలిపారు.

పింఛన్ల పంపిణీ

పెనమలూరు: పెనమలూరు మండలం, తాడిగడప మున్సిపాలిటీ పరిధిలో ఉన్న పింఛన్ లబ్ధిదారులకు శనివారం పంపిణీ చేశారు. పెనమలూరు మండలంలో పింఛన్ లబ్ధిదారులు 5,786 మందికి రూ.1,72,67,500 కోట్ల నిధులు మంజూరు చేశారు. తాడిగడప మున్సిపాలిటీకి 12,800 మంది లబ్ధిదారులకు రూ.3,85,66,000 కోట్ల నిధులు ప్రభుత్వం విడుదల చేసింది. డీబీటీ కింద బ్యాంకు ఖాతాలు ఉన్న వారికి నేరుగా సొమ్ము వారి ఖాతాలో ప్రభుత్వం జమ చేసింది. బ్యాంకు ఖాతాలేని లబ్ధిదారులకు సచివాలయ సిబ్బంది పింఛన్ సొమ్ము పంపిణీ చేస్తున్నారు. పెనమలూరులో 60 శాతం, తాడిగడప మున్సిపాలిటీలో 58 శాతం పింఛన్లు పంపిణీ చేశారు. మరో రెండు రోజుల్లో మొత్తం పింఛన్ సొమ్ము అందుతుందని ఎంపీడీఓ కుమార్‌బాబు తెలిపారు.

వైభవంగా హనుమజ్జయంతి వేడుకలు

- ఆలయాలకు తరలివచ్చిన భక్తులు
- అభిషేకాలు, పూజలు
- అన్నప్రసాదం వితరణ



పోరంకి దాసాంజనేయస్వామి ఆలయంలో అన్నసమారాధన చేస్తున్న మంత్రి జోగి రమేష్



ఊరేగింపులో ప్రత్యేక ఆకర్షణగా ఆంజనేయస్వామి ప్రతిమ

హనుమాన్‌జంక్షన్ రూరల్: పెనమలూరు, గన్నవరం నియోజకవర్గాల్లో హనుమజ్జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. హనుమాన్‌జంక్షన్‌లోని అభయాంజనేయస్వామి దేవస్థానానికి భక్తులు పోటెత్తారు. హనుమజ్జయంతి సందర్భంగా శనివారం వేలాది మంది భక్తులు అభయాంజనేయుడిని దర్శించుకునేందుకు ఇక్కడికి తరలివచ్చారు. ఆలయ ప్రధానార్చకులు మారేపల్లి సీతారామానుజాచార్యులు నేతృత్వంలో అర్చకులు గొట్టిపాళ్ల శ్రీనివాసాచార్యులు, శృంగారం రామాచార్యులు స్వామికి అభిషేకాలను నిర్వహించారు. అనంతరం సుందరంగా అలంకరించారు. భక్తులతో అభయాంజనేయస్వామి ఆలయం కిటకిటలాడింది. దేవదాయ శాఖ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. వైఎస్సార్ సీపీ సీనియర్ నేత, ఏపీ ఆయిల్‌ఫెడ్ ఫార్మర్స్ కమిటీ మాజీ చైర్మన్ కొలారు రామచంద్రరావు, ఏపీ రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ కనుమూరి సుబ్బరాజు, ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ చైర్మన్ పిల్లంగోళ్ల శ్రీలక్ష్మి, కృష్ణామిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు, ఏలూరు మేయర్ షేక్ నూర్జహాన్ బేగం, మాజీ ఎమ్మెల్యేలు దాసరి బాలవర్ధనరావు, చింతమనేని ప్రభాకర్, కేడీసీసీబీ మాజీ చైర్మన్ యార్లగడ్డ వెంకట్రావు, దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ సీహెచ్ రంగారావు స్వామి వారిని దర్శించుకుని పూజలు చేశారు. పలు వ్యాపార సంస్థలు భక్తులకు మంచినీరు, మజ్జిగ ప్యాకెట్లు ఉచితంగా పంపిణీ చేశారు. దెందులూరు ఏఎంసీ చైర్మన్ అప్పన కనకదుర్గా ప్రసాద్, ఆలయ పాలకమండలి మాజీ చైర్మన్ నెరుసు భూషణం, మాజీ డైరెక్టర్ మేడేపూడి రామ్మోహనరావు, ఆలయ కార్యనిర్వాహణాధికారి కూచిపూడి శ్రీనివాస్ ఏర్పాట్లను పర్యవేక్షించారు. హనుమాన్‌జంక్షన్ లారీ ఓనర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో 25 వేల మందికి భక్తులకు అన్నదానం చేశారు. అభయాంజనేయ స్వామి వారి ఉత్సవ విగ్రహాన్ని ఊరేగింపుగా అన్నదానం ప్రాంగణానికి తీసుకువచ్చి విశేష పూజలు చేశారు. ప్రముఖ ట్రాన్స్‌పోర్ట్ వ్యాపారి కనుమూరి సూర్యనారాయణరాజు (చిన్నరాజు) నేతృత్వంలో లారీ ఓనర్స్, వర్కర్స్ కుల, మతాలకు అతీతంగా అన్న ప్రసాద వితరణ ఏర్పాట్లును పర్యవేక్షించారు. స్వామి వారికి భక్తులు సమర్పించిన భారీ లడ్డూ ప్రసాదాలకు దేవదాయ శాఖ అధికారులు వేలం నిర్వహించారు. 25 కేజీల లడ్డూను దెందులూరు ఏఎంసీ చైర్మన్ అప్పన కనకదుర్గా ప్రసాద్ రూ.14,400లకు దక్కించుకోగా, 18 కేజీల లడ్డూను అలేటి రాజా రూ.10 వేలకు, 10 కేజీల లడ్డూను తాతా వెంకట్రావు రూ.7,300లకు వేలంలో సొంతం చేసుకున్నారు.

హనుమజ్జయంతి వేడుకల్లో మంత్రి జోగి రమేష్..

పోరంకి సాలిపేటలోని శ్రీదాసాంజనేయస్వామివారి ఆలయంలో జరిగిన జయంతి వేడుకల్లో రాష్ట్ర గృహనిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. పూజల అనంతరం భక్తులకు అన్నసమారాధన చేశారు. ఆలయ కమిటీ సభ్యులతో పాటు వైఎస్సార్ సీపీ నేతలు, భక్తులు పాల్గొన్నారు.

పురవీధుల్లో స్వామి వారి ఊరేగింపు..

అభయాంజనేయ స్వామికి గ్రామోత్సవం నిర్వహించారు. ఊరేగింపులో దేవతామూర్తుల వేషధారణలు, అగ్ని విన్యాసాలు, విచిత్ర వేషాలు విశేషంగా ఆకట్టుకున్నారు. ఊరేగింపు వాహనంపై హనుమాన్, శ్రీరాముడి ప్రతిమలతో ఏర్పాటు చేసిన సెట్టింగ్ ప్రత్యేకంగా నిల్చింది.

నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామంలో హనుమజ్జయంతి వేడుకలు శనివారం వైభవంగా నిర్వహించారు. శ్రీయోగీశ్వరీదేవీ దయాల్ మహామందిర్ యోగా ఆశ్రమంలో ప్రధాన యోగాచార్య స్వామి అమిత్ దేవ్‌జీ ఆధ్వర్యంలో హనుమజ్జయంతి వేడుకలు జరిగాయి. యోగీశ్వర్ దేవిదయాల్ జోతిర్లింగ్ అభిషేకం, యోగీశ్వర్ రామ్‌లాల్ జీ, ములకరాజ్ జీ, దేవిదయాల్ జీ, స్వామీ సురేంద్ర దేవ్‌జీ మహారాజ్, హనుమంతుని పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. మహిళలు 108 దఫాలు హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. చంద్రశేఖరేంద్ర సరస్వతి స్వామి దేవస్థానములు చినకంచిలో హనుమజ్జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. పంచామృతాలతో స్వామికి అభిషేకాలు నిర్వహించి ఆకుపూజ చేశారు. అనంతరం అన్నదానం చేశారు. గ్రామంలోని తూర్పు, పడమర, బోడపాడులోని రామాలయాల్లో హనుమజ్జయంతి సందర్భంగా అభిషేకాలు, ఆకుపూజ నిర్వహించారు. వెంకటాపురం గ్రామంలోని రామాలయంలో, పాతపాడు గ్రామంలోని శ్రీపంచముఖ ఆంజనేయస్వామి ఆలయంలో హనుమజ్జయంతి సందర్భంగా అభిషేకాలు, ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు. చెన్నకేశవస్వామి దేవస్థానంలో హనుమజ్జయంతి సందర్భంగా అభిషేకాలు ఆకుపూజ నిర్వహించారు. అంబాపురం గ్రామం కొండపైన అంజనేయస్వామి ఆలయంలో హనుమజ్జయంతి సందర్భంగా స్వామికి అభిషేకాలు నిర్వహించి, ఆకుపూజ చేశారు.

కంకిపాడు: హనుమజ్జయంతి ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ఉదయాన్నే ఆంజనేయస్వామి ఆలయాలు, రామాలయాలకు భక్తజనం పోటెత్తారు. శనివారం హనుమజ్జయంతి సందర్భంగా మండలంలోని కంకిపాడు, మద్దూరు, ఈడుపుగల్లు, ప్రొద్దుటూరు, చలివేంద్రపాలెం గ్రామాల్లో ఆంజనేయస్వామి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఉత్సవాల సందర్భంగా గారెలు, తమలపాకులతో ప్రత్యేక మాలలు తయారు చేసి ఆంజనేయ స్వామి విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించారు. మద్దూరు కరకట్టపై ఆంజనేయస్వామి ఆలయంలో ఆంజనేయుడి భారీ విగ్రహానికి పూలమాలలు, గారెల మాలలు అలంకరించారు. భక్తులకు నిర్వాహక ప్రతినిధులు అన్నసంతర్పణ జరిపించారు. చలివేంద్రపాలెం గ్రామంలోని అభయాంజనేయ స్వామి దేవస్థానంలో పంచామృతాలు, పండ్ల రసాలతో స్వామికి అభిషేకాలు చేయించారు. స్వామి వారిని భక్తులు దర్శించుకున్నారు. గీతాకృష్ణ మహిళా మండలి ఆలపించిన భక్తిగీతాలు, హనుమాన్ చాలీసా అలరించాయి. విజయ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ సౌజన్యంతో ఏర్పాటు చేసిన ఉచిత మెగా వైద్య శిబిరంలో 240 మంది రోగులకు పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. నిర్వాహక కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నసంతర్పణకు భక్తులు భారీగా తరలివచ్చారు. కార్యక్రమాలను గురుస్వామి కోసూరు శ్రీనివాసరావు పర్యవేక్షించారు.

పెనమలూరు: మండల పరిధిలో శనివారం శ్రీఆంజనేయస్వామివార్ల జయంతి వేడుకలు ఘనంగా చేశారు. యనమలకుదురు శ్రీరామలింగేశ్వర స్వామి దేవస్థానం కొండపై శ్రీఆంజనేయస్వామివారి 50 అడుగుల విగ్రహానికి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం 7 గంటలకు అభిషేకం నిర్వహించారు. భక్తురాలు వెలగపూడి విజయలక్ష్మి ఆధ్వర్యంలో సాయి భక్త బృందం 108 సార్లు హనుమాన్‌చాలీసా సంకీర్తన చేశారు. భక్తులకు ప్రసాదం అందజేశారు. పోరంకి శ్రీనగర్‌కాలనీలో శ్రీకోండండ రామాలయంలో శ్రీ ఆంజనేయస్వామి జయంతి వేడుకలు భక్తులు నిర్వహించారు. పూజారి సురేష్ శర్మ ఆధ్వర్యంలో సహస్రనామార్చన, అభిషేకం, లక్ష తమలపాకులతో 108 సార్లు హనుమాన్‌చాలీసా పారాయణం భక్తులు సామూహికంగా చేశారు. ఆలయ కమిటీ సభ్యులు రాధాకృష్ణమూర్తి, సత్యనారాయణ, సుధారాని, మహేష్, కనకరాజు, గ్రామస్తులు పాల్గొన్నారు. పోరంకి శివాలయం వద్ద ఉన్న శ్రీ ఆంజనేయస్వామివారి ఆలయంతో పాటు గ్రామాల్లో ఆంజనేయ స్వామి ఆలయాల్లో హనుమాన్ జయంతి భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.



దేవస్థానం వద్ద క్యూలైన్‌లో బారులు తీరిన భక్తులు

గన్నవరం: హనుమజ్జయంతి వేడుకలను శనివారం గన్నవరం ప్రాంతంలో వైభవంగా నిర్వహించారు. దావాజిగూడెంలోని శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థానంలో శ్రీఆంజనేయస్వామికి లక్ష తమలపాకులతో సహస్రనామార్చనలు జరిపారు. పరిసరా గ్రామాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్ని స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం భక్తులకు అన్నసమారాధన చేశారు. ఆలయ అర్చకులు ఎస్.రామాచార్యులు, పలువురు గ్రామ ప్రముఖులు పాల్గొన్నారు. స్థానిక ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని శ్రీభక్తాంజనేయస్వామి ఆలయంలో జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. దేవదాయ శాఖ ఆధ్వర్యంలో స్వామివారికి తమలపాకులతో అర్చన, ప్రత్యేక అలంకరణలు జరిపారు.



నున్న ఆశ్రమంలో పూజలందుకున్న ఆంజనేయస్వామి



గన్నవరంలో స్వామివారికి పూజలు చేస్తున్న అర్చకులు



ఉయ్యూరు హనుమాన్ నగర్‌లో పూజలు చేస్తున్న భక్తులు

భక్తులకు అన్నసంతర్పణ చేశారు. కేసరపల్లి బైపాస్‌లోని శ్రీవీరాంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు, అన్నసమారాధన చేశారు.

ఉయ్యూరు: హనుమాన్‌జయంతి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉయ్యూరు పట్టణంతో పాటు మండలంలోని అన్ని గ్రామాల్లో శనివారం వేకువఝాము నుంచే విశేష పూజా కార్యక్రమాలు జరిగాయి. హనుమాన్ చాలీసా పారాయణం చేసి భక్తిపారవశ్యం చెందారు. ఉయ్యూరు పట్టణంలోని హనుమాన్ నగర్‌లో ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి వేలాది మందికి అన్నసంతర్పణ చేశారు. వైఎస్సార్ సీపీ వైద్య విభాగం రాష్ట్ర కార్యదర్శి, మున్సిపల్ కౌన్సిలర్ డాక్టర్ జంపాన పూర్ణిమ ప్రత్యేక పూజలు చేశారు. సువర్చలాంజనేయస్వామి ఆలయంలో ఉత్సవాలు వైభవంగా ముగిశాయి. బస్టాండు సెంటరులోని అభయాంజనేయస్వామి ఆలయం వద్ద హనుమజ్జయంతి సందర్భంగా భక్తులకు అన్నసంతర్పణ చేశారు.

గన్నవరం రూరల్: మండలంలోని చిక్కవరం గ్రామంలో శ్రీక్షేత్ర హనుమత్‌పురంలో శనివారం హనుమత్ జయంతి వేడుకలు భక్తులు వైభవంగా నిర్వహించారు. ఆంజనేయ స్వామికి అభిషేకాలు, అలంకరణలు చేశారు. పరిసర గ్రామాల భక్తులు విశేషంగా తరలివచ్చి స్వామివారిని దర్శించారు. ప్రత్యేక పూజలు చేశారు. కోలాట బృందం ప్రదర్శన భక్తులను అలరించింది. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో తీర్థ ప్రసాదాల వితరణ, మజ్జిగ పంపిణీ, అన్నసంతర్పణ జరిగాయి. బీబీగూడెం, సూరంపల్లి, తెంపల్లి తదితర గ్రామాల్లో భక్తులు హనుమత్‌జయంతిని ఘనంగా నిర్వహించారు.

సీఎం జగన్‌కు స్వాగతం పలికిన నేతలు

రామవరప్పాడు: విదేశీ పర్యటన పూర్తి చేసుకుని గన్నవరం ఎయిర్ పోర్టు నుంచి శనివారం ఉదయం నగరానికి చేరుకున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి పలు గ్రామాల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అపూర్వ స్వాగతం పలికారు. రామవరప్పాడు, ప్రసాదంపాడు గ్రామాల్లో గొల్లపూడి మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ కొమ్మా కోట్లు ఆధ్వర్యంలో, ఎనికేపాడులో గౌడ కార్పొరేషన్ చైర్మన్ మాదు శివరామకృష్ణ, సర్పంచ్ రాచమళ్ల పూర్ణచంద్రరావు, కోనేరు సుబ్బారావుల ఆధ్వర్యంలో, నిడమానూరులో వైఎస్సార్ సీపీ రూరల్ మండల కన్వీనర్, గ్రామ సర్పంచ్ శీలం రంగారావు ఆధ్వర్యంలో సీఎం జగన్‌కు ఘనంగా స్వాగతం పలికారు. జగన్ పర్యటన పూర్తి చేసుకుని నగరానికి వస్తున్నారన్న విషయం తెలుసుకుని పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఉదయం నాలుగు గంటల నుంచే అహ్వానం పలికేందుకు జాతీయరహదారిపై ఆయా గ్రామాల్లో బారులు తీరారు. రాష్ట్రానికి రెండవసారి కాబోయే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అంటూ నినాదాలు చేశారు. పలు గ్రామాల్లో మహిళలు, యువకులు వైఎస్సార్ సీపీ జెండాలు చేతపట్టుకుని జై జగన్ అంటూ నినాదాలు చేస్తూ తమ అభిమానాన్ని చాటుకున్నారు. ఆయా గ్రామాల్లో ఎంపీటీసీ, వార్డు సభ్యులు స్వాగతం పలికిన వారిలో ఉన్నారు.



ఎనికేపాడులో సీఎం జగన్‌కు స్వాగతం పలుకుతున్న శివరామకృష్ణ, సర్పంచ్ పూర్ణ తదితరులు

కొనసాగుతున్న వేసవి విజ్ఞాన శిబిరాలు



పెనమలూరు గ్రంథాలయంలో నీతి కథ చెబుతున్న విద్యార్థిని



తెన్నేరు గ్రంథాలయంలో పత్రికలు చదువుతున్న విద్యార్థులు

గన్నవరం రూరల్: విద్యార్థులు నీతి కథలలోని సారాంశాన్ని గ్రహించి ఎదగాలని పురుషోత్తపట్నం శాఖా గ్రంథాలయం లైబ్రేరియన్ కె.కృపానందం చెప్పారు. శనివారం స్థానిక లైబ్రరీలో సమ్మర్ క్యాంపులో భాగంగా విద్యార్థులతో నీతి కథలు చదివి వినిపించారు. ఆయన మాట్లాడుతూ చిన్ననాటి నుంచి నీతిగా నడుచుకోవటం అలవాటు చేసుకోవాలని చెప్పారు. పాఠకులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు. ముస్తాబాద శాఖా గ్రంథాలయంలో లైబ్రేరియన్ కె.జ్యోతికుమారి పర్యవేక్షణలో విద్యార్థులు శనివారం డ్రాయింగ్ పోటీలు, న్యూస్ పేపర్‌లు చదవటం నేర్పించారు. గ్రామ పెద్దలు విద్యార్థులను అభినందించారు.

పెనమలూరు: వణుకూరు గ్రంథాలయంలో శనివారం విద్యార్థులకు లెక్కల పై (మ్యాథ్స్) మెలకువలు తెలిపారు. రిసోర్స్ పర్సన్ పామర్తి సురేష్ విద్యార్థులకు లెక్కల సబ్‌జెక్టుపై ఉన్న భయం, అపోహలు పోగొట్టే విధంగా లెక్కలపై అవగాహన కల్పించారు. విద్యార్థులు పుస్తక పఠనం, తోక కథలు, ఆటల పోటీలు నిర్వహించారు. గ్రంథాలయ అధికారిణి భారతి విద్యార్థులకు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. పెనమలూరు శాఖ గ్రంథాలయంలో విద్యార్థులు పుస్తక పఠనం, కథలు చెప్పటం, డ్యాన్స్ కార్యక్రమాలు గ్రంథాలయ అధికారిణి హరాస నిర్వహించారు.

కంకిపాడు: చదువు, క్రీడలూ రెండూ ముఖ్యమేనని తెన్నేరు గ్రంథాలయాధికారి ఎస్.సునీత అన్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరాలు ఉత్సాహంగా కొనసాగుతున్నాయి. తెన్నేరు శాఖా గ్రంథాలయంలో శనివారం విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించారు. పుస్తక పఠనం, పత్రికల పఠనంపై శిక్షణ ఇచ్చారు. శిక్షణ కార్యక్రమాలను గ్రంథాలయాధికారి ఎస్.సునీత పర్యవేక్షించారు.

వైఎస్సార్ సీపీ వైపు సర్వే సంస్థల మొగ్గు

- వైఎస్సార్ సీపీలో జోష్
- మెత్తబడిన టీడీపీ శ్రేణులు



పోలింగ్ కేంద్రం వద్ద బారులు తీరిన ఓటర్లు (ఫైల్)

పెనమలూరు: పెనమలూరు నియోజకవర్గంలో ఏ పార్టీని ఓటర్లు గెలిపిస్తారనే విషయం ఎన్నికల తరువాత నుంచి పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. టీడీపీ నేతలు తొలుత దూకుడుగా ఉండి పందేలు కట్టినా తరువాత మెత్త బడ్డారు. సర్వే సంస్థల మొగ్గు వైఎస్సార్ సీపీ వైపే చూపడంలో వైఎస్సార్ సీపీ శ్రేణుల్లో జోష్ పెరిగింది. పైగా ప్రభుత్వ సంక్షేమ పథకాల కారణంగానే పోలింగ్ శాతం బాగా పెరిగిందని రాజకీయ విశ్లేషకులు తెలుపటంతో గత కొద్ది రోజులుగా హడావుడి చేసిన టీడీపీ శ్రేణులు చతికిల పడ్డారు.

పెనమలూరులో భిన్నమైన ఓటర్లు..

పెనమలూరు నియోజకవర్గంలో భిన్నమైన ఓటర్లు ఉన్నారు. తాడిగడప మున్సిపాలిటీ, ఉయ్యూరు నగర పంచాయతీలు పట్టణ పరిధిలో ఉన్నాయి. ఇక రూరల్ పరిధిలో పెనమలూరు, ఉయ్యూరు రూరల్, కంకిపాడు మండలాలు ఉన్నాయి. దీని కారణంగా ఓటరు నాడి అంత తేలికగా గుర్తించలేని పరిస్థితి ఉంది. అయితే జగనన్న సంక్షేమ పథకాలు అర్బన్, రూరల్ ప్రాంతాల్లో ప్రతి గడపకు పక్కాగా అమలు జరగటంతో అన్నం పెట్టిన వారికే ఓటు అనే నినాదం వినబడుతోంది. మహిళా ఓటర్లు పురుష ఓటర్ల కంటే దాదాపు ఆరున్నర వేలు అధికంగా వేశారు. కాలువ కట్టలపై నివశిస్తున్న పేదలకు జగనన్న ప్రభుత్వం అండగా ఉండటంతో కాలువ కట్ట ఓటర్లు జగనన్నకు మద్దతుగా నిలిచారు. గత చరిత్రలో లేని విధంగా పెనమలూరు నియోజకవర్గ పరిధిలో దాదాపు 20 వేల మందికి పైగా జగనన్న ఇళ్ల స్థలాలు ఇచ్చి ఇళ్లు నిర్మించారు. అయితే గెలుపుపై ఎవరి ధీమా వారు వ్యక్తం చేస్తున్నారు.

కీలకంగా మారిన పోస్టల్ బ్యాలెట్ ఓట్లు..

పెనమలూరు నియోజకవర్గంలో సాధారణ ఓట్లతో పాటు పోస్టల్ బ్యాలెట్ ఓట్లు కూడా అత్యంత కీలకంగా మారాయి. పెనమలూరు నియోజకవర్గం పరిధిలో 2,162 పోస్టల్ బ్యాలెట్ ఓటర్లతో పాటు ఇతర ప్రాంతాలలో పని చేసే వారు 1,058 మంది కలిపి మొత్తం 3,220 మంది ఓట్లు వేశారు. హోం ఓటర్లు 367 కలిపితే మొత్తం ఓట్లు 3,587 ఓట్లు పోల్ అయ్యాయి. సర్వీస్ ఓటర్లు 718 గాను ఇప్పటివరకు 31 ఓట్లు అందాయి. మొత్తం అన్ని ఓట్లు కలిపితే 2,36,970 ఓట్లు కౌంటింగ్ రోజు లెక్కించాల్సి ఉంది. ఇంకా రావల్సిన సర్వీస్ ఓట్లను 4వ తేదీ ఉదయం 6.45 గంటల వరకు స్వీకరిస్తారు.

జెడ్పీ హైస్కూలును సందర్శించిన విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ



గొల్లనపల్లి జెడ్పీహైస్కూల్‌లో అధికారులకు ఆదేశాలిస్తున్న ప్రవీణ్ ప్రకాష్

గన్నవరం రూరల్: కృష్ణాజిల్లా గన్నవరం మండలంలోని గొల్లనపల్లి జెడ్పీ హైస్కూల్‌ను శనివారం విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్ సందర్శించారు. తరగతి గదులను పరిశీలించారు. విద్యా సంవత్సరం ప్రారంభం కానున్న నేపథ్యంలో అన్ని తరగతి గదుల్లో ఐఎఫ్ ప్యానల్స్ విద్యా బోధనకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. ఇప్పటికే పాఠశాలలో ఏర్పాటు చేసిన ప్యానల్స్‌ను పరిశీలించారు. పాఠశాల విద్యార్థుల సంఖ్య, వసతులు, బోధన, క్రీడా ప్రాంగణం తదితర వివరాలను ప్రధానోపాధ్యాయుడు కేఎస్ జగదీశ్వరరావు ఆయనకు వివరించారు. ఏఎస్‌పీడీ శ్రీనివాసులరెడ్డి, డీఈవో తాహెరా సుల్తానా, సమగ్ర శిక్షా జిల్లా కో ఆర్డినేటర్ నాయక్, డివిజనల్ విద్యాశాఖాధికారి పద్మరాణి, ఎంఈవో కొండా రవికుమార్, ఎంఈవో-2 కమల, ఏఈలు రాయన్న, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంత వాతావరణానికి సహకరించండి

-ఎస్ఐ పైడిబాబు



జోసఫ్‌నగర్ వాసులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ పైడిబాబు

ఉంగుటూరు: మండలంలో ఈ నెల 4,5,6 తేదీల్లో 144 సీఆర్‌పీసీ సెక్షన్ 30 పోలీస్ యాక్ట్ అమలులో ఉందని గ్రామాల్లో ప్రశాంత వాతావరణానికి అందరు సహకరించాలని ఆత్కూరు ఎస్ఐ పైడిబాబు కోరారు. తేలప్రోలు జోసఫ్‌నగర్‌లో విజిబుల్ పోలీసింగ్ శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజలు గుంపులుగా ఉండకూడదని, 4,5,6 తేదీల్లో విజయోత్సవ ర్యాలీలు, బాణ సంచా కాల్చడం, పబ్లిక్ మీటింగ్‌లకు అనుమతులు లేవని అన్నారు. శాంతి భద్రతల పరీరక్షణలో బాగంగా అందరూ నిబంధనలు పాటించి పోలీసులకు సహకరించాలని కోరారు. పలువురు అనుమానితులకు ముందస్తు నోటీసులు జారీ చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

శాంతిభద్రతలపై ఐజీ సమీక్ష

పెనమలూరు: పెనమలూరు పోలీస్‌స్టేషన్‌ను ఐజీ అశోక్‌కుమార్ శనివారం తనిఖీ చేశారు. ఓట్ల కౌంటింగ్ సందర్భంగా పెనమలూరు నియోజకవర్గ పరిధిలో శాంతి భద్రతల పర్యవేక్షించేందుకు ఆయన నియోజకవర్గ పరిధిలో పర్యటించారు. అనంతరం పెనమలూరు పోలీస్‌స్టేషన్‌లో అధికారులతో సమీక్ష నిర్వహించారు. బందోబస్తు వివరాలు అడిగి తెలుసుకున్నారు. 144 సెక్షన్ పటిష్టంగా అమలు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌చార్జి ఎస్పీ రజిని, ఇన్‌చార్జి డీఎస్పీ శుభాష్, సీఐలు టీవీవీ.రామారావు, వాసంశెట్టి శ్రీనివాసరావు, ఎండీ హబీబ్‌బాషా, ఎస్ఐలు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.